క్లుప్తంగా

డాడ్జి బాల్ పోటీల్లో బంగారు పతకం



విద్యార్థులకు కప్‌ను అందిస్తున్న రోటరీ క్లబ్ నిర్వాహకులు

కౌతాళం: జోనల్‌స్థాయి డాడ్జి బాల్ క్రీడలో బదినేహాల్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు బంగారు పతకం సాధించారని పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం సిద్ధప్ప తెలిపారు. మంగళవారం పాఠశాలలో పతకం సాధించిన పాఠశాల విద్యార్థులను, వ్యాయమ ఉపాధ్యాయుడు నర్సిమరాజుకు అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఆదోని రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఆదోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన జోనల్‌స్థాయి క్రీడా పోటీల్లో మంగళవారం ఫైనల్ పోటీలు జరిగాయన్నారు. ఇందులో బాలుర విభాగంలో డాడ్జి క్రీడలో తమ పాఠశాల విద్యార్థులు బంగారు పతకం సాధించినట్లు ఆయన వెల్లడించారు. గెలుపు పొందిన జట్టుకు రోటరీ క్లబ్ సభ్యులు ఆదోని మున్సిపాల్ కౌన్సిలర్ సందీప్ రెడ్డి చేతుల మీదుగా కప్‌ను, ప్రశంసా పత్రాలను అందజేసినట్లు తెలిపారు.

ఫుట్‌బాల్ విజేత కోసిగి



విజేతలుగా నిలిచిన విద్యార్థులు

కోసిగి: ఆదోనిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్, బాస్కెల్ బాల్ టోర్నమెంట్‌లో కోసిగి మౌంట్ కార్మెల్ పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. పాఠశాల విద్యార్థులు ఫుట్ బాల్ పోటీల్లో ప్రథమ స్థానం, బాస్కెట్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచింది. వరుసగా మూడవ సారి ఫుట్‌బాల్‌లో విజేతగా గెలుపొందినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జాన్సన్, కరస్పాండెంట్ టోనీ, పీఈటీ శేఖర్, పరుశురామ్‌లు తెలిపారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



నిరసన తెలియజేస్తున్న నాయకులు

గోనెగండ్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు ఆనంద్ బాబు, సాయి ఉదయ్, నరసింహ, కరుణాకర్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రంగస్వామి ఆధ్వర్యంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, యూటీఎఫ్, ఏపీడీకేఎస్, రైతు సంఘాల నాయకులు మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజ్ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు నరసింహులు శివ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతల ఉత్సవాలు ప్రారంభం



సాతనూరులో ఆలయ ప్రధాన రహదారిలో విద్యుత్ దీపాలంకరణ

కోసిగి: మండలంలోని చింతకుంట, జుమ్మాల దిన్నె, గౌడుగల్లు, వందగల్లు, దుద్ది, కొల్మాన్‌పేట, సాతనూరు, అగసనూరు గ్రామాల్లో గ్రామ దేవతలు మారెమ్మ, దేవమ్మ దేవిల దేవర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమైయ్యాయి. మంగళవారం అర్ధ రాత్రి గ్రామ దేవతల విగ్రహాలను డప్పువాయిద్యాలు, మేళతాళాలతో పురవీధుల గుండా రథాలపై ఊరేగింపుగా తీసుకెళ్లి కొలువుదీర్చనున్నారు. వేకువ జామున ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దల సమక్షంలో నైవేద్యం తయారు చేసి అమ్మవార్లకు సమర్పించి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

గణేకల్‌లో బంగారమ్మ దేవర



ఆదోని రూరల్: మండలంలోని గణేకల్ గ్రామంలో మంగళవారం బంగారమ్మవ్వ దేవర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు గ్రామంలోని దేవమ్మవ్వ, లక్ష్మమ్మవ్వ, సుంకులమ్మవ్వ, బంగారమ్మవ్వ ఆలయాలకు భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి పెద్ద పోతును ఊరేగింపు నిర్వహించారు.

29 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఈనెల 29.30 తేదీల్లో సీపీఎం 23వ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ నాయకులు రాముడు, కృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ కాలనీలో ఆటో కార్మికులకు జిల్లా మహాసభల కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు.



నందవరంలో ముస్తాబైన ఐఎంబీ చర్చి



ఆదోని ఆర్‌సీఎం చర్చి



విద్యుద్దీపాల వెలుగులో ఆదోని సీఎస్ఐ చర్చి



ముస్తాబైన కౌతాళంలోని సీఎస్ఐ చర్చి

క్రీస్తు పుట్టుక.. లోకానికి పండుగ

- నేడు క్రిస్మస్ పండుగ
- రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబైన చర్చిలు
- అర్ధరాత్రి నుంచి మొదలైన క్రిస్మస్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఆకట్టుకుంటున్న సెట్టింగులు



ఆదోని ఆర్‌సీఎం చర్చి అవరణలో ఏర్పాటు చేసిన కల్వరి కొండ నమూనా

ఆదోని సెంట్రల్: పట్టణంలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని చర్చిలను విద్యుత్ దీపాల అలంకరణలతో ముస్తాబయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. యువత క్యాండిల్ లైట్ సర్వీసు నిర్వహించారు. అయా చర్చిలకు బాధ్యులైన పెద్దలు, గురువులు ఏర్పాట్లను చేశారు. పట్టణంలోని బుధవారపేటలోని ఆర్‌సీయం చర్చి, ఎస్‌కేడీ కాలనీలోని హోలీ ట్రినిటి చర్చి, విక్టోరియపేటలోని సీఎస్ఐ చర్చి, పట్టణంలోని అస్పరి మెయిన్ రహదారిలో ఉన్న పరిశుద్ధ బాల యేసు మందిరంతో పాటు అయా కాలనీలో ఉన్న చర్చిలను విద్యుత్ దీపాల అలంకరణలో ముస్తాబు చేశారు. క్రీస్తు జననానికి సంబంధించిన సెట్టింగులు పలువురిని అకట్టు కుంటున్నాయి. చర్చిలలో పెద్ద పెద్ద క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేశారు. క్రైస్తవులు క్రీస్తు జననానికి గుర్తుగా ఇళ్లపైన స్టార్‌లను, క్రిస్మస్ ట్రీలతో అలంకరించుకున్నారు.

ముస్తాబైన చర్చిలు

కౌతాళం: క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని చర్చిలు రంగురంగులతో, విద్యుత్ దీపాలతో ముస్తాబయ్యాయి. మండలంలోని ఎరిగేరిలోని సీఎస్ఐ చర్చి, కౌతాళంలోని ఈఎస్ఐ, సీఎస్ఐ చర్చి, హల్విలోని చర్చి, బాపురంలోని చర్చి, ఎరిగేరిలో చర్చి, కామవరం, చూడి, బంటకుంట, సుళేకేరి, ఉరుకుంద, బదినేహాల్, ఉప్పరహాల్ గ్రామాలలో చర్చిలను వివిధ రంగులతో విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

నందవరం : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని క్రైస్తవాలయాలు సుందరంగా ముస్తాబవుతున్నాయి. మంగళవారం మండల కేంద్రంలోని ఐఎంబి చర్చి రంగు కాగితాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే మండల పరిధిలోని నాగలదిన్నె, ముగతి, కనకవీడు, టి.సోమలగూడూరు, హాలహర్వి, మాచాపురం తదితర గ్రామాలలో చర్చిలకు రంగులు వేసి, రంగు కాగితాలలో విద్యుత్ దీపాలతో స్టార్ నక్షత్రాలను సుందరంగా అలంకరించారు.

గోనెగండ్ల : గోనెగండ్లలో ఎఫ్రాతా ప్రార్థన మందిరము, క్రీస్తు సంఘం, హెచ్ కైరవాడి, గంజిహళ్లి గ్రామాలలో ఏబీఎం చర్చి తదితర ప్రార్థన మందిరాలలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు విద్యుత్ అలంకారంతో ఏర్పాట్లు చేశారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ వేడుకలు మొదలయ్యాయి. గ్రామాలలోని పలు చర్చిలలో క్రిస్మస్ ట్రీ, పశువుల పాక, నక్షత్రాలు, దేవ దూతలు విద్యుత్ దీపాలంకరణతో ఆకట్టుకుంటుంది. మండలంలోని చర్చిలన్నింటినీ రంగు రంగుల కాగితాలతో, విద్యుత్ దీపాల అలంకరణతో ముస్తాబు చేశారు. ఆయా చర్చిలో చేరి యేసు పుట్టుక స్మరించుకుంటూ ప్రత్యేక పార్థనలు నిర్వహించారు.



విద్యుత్ దీపాలంకరణలో హెచ్ కైరవాడి ఏబీఎం చర్చి

కోసిగి: మండలంలోని గ్రామ గ్రామాన క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు క్రీస్తు మందిరం, చర్చిలను విద్యుత్ దీపాలంకరణలో రంగు రంగులతో ముస్తాబు చేశారు. కోసిగిలో కడపాళెం వీధిలోని సీఐఎస్ , క్రీస్తు సంఘం, ఆర్‌సీఎంలతో పాటు మండలంలోని పెద్దభూంపల్లి, దుద్ది, అగసనూరు, సాతనూరు, ఆర్లబండ, కామన్‌దొడ్డి, జంపాపురం, సజ్జలగుడ్డం, ఐరన్‌గల్లు, చింతకుంట, డి.బెళగల్, చిన్నభూంపల్లి, వందగల్లు, జుమ్మాలదిన్నె, తదితర గ్రామాల్లో చర్చిలను ముస్తాబు చేశారు. పల్లెపాడు గ్రామంలో సంఘం పెద్దలు లక్ష్మన్న, భాస్కర్, ఈరన్న, ఆగ్రీప్, రాజేష్, సంఘం యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్రీస్తు జననం పశువుల పాక సెట్టింగు, క్రిస్మస్ చెట్టు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు.



పల్లెపాడులో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ, పశువుల పాక సెట్టింగ్

భూ సమస్యలు పరిష్కరించుకోండి



కలుగొట్లలో అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఎమ్మిగనూరురూరల్: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు చాలా కాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి మంచి వేదిక రెవెన్యూ సదస్సులన్నారు. జనవరి 8వ తేదీ వరకు ఈ సదస్సులు జరుగుతాయని, 8 తరువాత వచ్చిన సమస్యలకు కూడా పరిష్కారం చూపుతామని చెప్పారు. భూ సమస్యలు, రికార్డులు, ఆన్‌లైన్లో పాస్ పుస్తకాలతో పాటు ఇతర సమస్యలను ప్రజలు వినతి పత్రాలు ఇవ్వవచ్చునని తెలిపారు. నేరుగా మీ గ్రామంలో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ప్రభుత్వం మీకు కల్పించదన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, ఇతర అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

గృహాల పరిశీలన:

గ్రామంలో నిర్మాణంలో ఉన్న గృహాలను సబ్ కలెక్టర్ మౌర భరద్వాజ్ పరిశీలించారు. గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని, ఏమైన సమస్య లుంటే మా దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. హౌసింగ్ డీఈ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

గోనెగండ్ల : మండలంలో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని చిన్నమరివీడు, కులుమాల గ్రామాల్లోని హౌసింగ్ లేఅవుట్లను మండల అధికారులతో కలిసి మంగళవారం సబ్ కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ప్రసాద్, ఎంపీడీఓ మణి మంజరి, హౌసింగ్ ఏఈ షేక్షావలి, ఏపీఓ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలపై 27న 'పోరుబాట'



పోరుబాట కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు,



కరపత్రాలు విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి

ఆదోని టౌన్: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ఈనెల 27వ తేదీన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్ సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్కేడీ కాలనీలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెంచిన విద్యుత్ గృహ విద్యుత్ చార్జీలను తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినియోగదారులపై రూ.15 వేల కోట్లు భారం పడిందన్నారు. వర్షాలు సకాలంలో కురవక అరకొరగా పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అన్నివిధాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీ

ఈనెల 27న వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఆలూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వరకు భారీ ఎత్తున మోటార్ సైకిళ్ల ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని రైతులు, యువత, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యుత్ చార్జీలను తగ్గించేంతవరకు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్‌లు నరసింహులు, గౌస్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నరసింహులు, బాషా, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు నాగరాజ్, కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, ఫయాజ్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

'పోరుబాట'కు సిద్ధం కావాలి

పెద్దకడబూరు : కరెంట్ చార్జీల బాదుడుపై పోరుబాటుకు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరులోని తమ నివాసంలో వైఎస్సార్ పోరుబాట కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూఈ నెల 27తేదీన అన్ని నియోజకవర్గ కేంద్రాలలో చేపట్టనున్న పోరుబాటుకు ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, ప్రహ్లాదాచారి, బీమారెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు రవిచంద్రరెడ్డి, నాగరాజుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దకడబూరు: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో క్రిస్మస్ పండగను పురస్కరించుకొని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో, పార్టీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే కబడ్డీ పోటీలను మంగళవారం వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీల వల్ల గ్రామాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయన్నారు. ఎలాంటి గొడవలకు తావులేకుండా ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో మెలగాలన్నారు. పోటీలలో విజేతకలకు మొదటి బహుమతి రూ. 15,016(దాత ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి) రెండవ బహుమతి రూ. 7,016 (దాత వైస్ ఎంపీపీ ముత్తమ్మ), మూడవ బహుమతి రూ. 2,016 (దాతలు చెగువేరా యూత్) నగదు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మయ్య, యల్లప్ప, లక్ష్మన్న, సోమప్పదని, లింగన్నగౌడ్, మదిరి రాముడు తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయం ఖాళీ..



ఖాళీగా ఉన్న కుర్చీలు

నందవరం : మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. అందులో మండల వ్యవసాయ అధికారిణి మర్రి స్రవంతి సెలవులు పెట్టగా, ఇతర అధికారులు ఏఈఓలు సురేంద్రగౌడ్ చదువుపై, ప్రభావతి బదిలీపై వెళ్లారు. ఏ అధికారి లేకపోవడంతో ఎంపీఈఓను ఉంచారు. అయితే ఆమె కూడా స్వకార్యంపై సెలవు పెట్టడంతో వ్యవసాయ కార్యాలయంలో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. పనుల నిమిత్తం వ్యవసాయ కార్యాలయానికి వచ్చిన రైతులు అధికారులు లేక వెనుదిరిగిపోయారు.

మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వద్దు

నందవరం : విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతపై వంట నిర్వహకులు నిర్లక్ష్యం వహించొద్దని ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీపీ తెలుగు మెయిన్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం, స్కూల్ రికార్డులు, రిజిస్టర్లను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వంట నిర్వహకులు శుచి, శుభ్రత పాటించాలన్నారు. మెనూ తప్పని సరి పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులకు గణితం సబెక్టులో సులభంగా అర్థమయ్యే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు మహబూబ్ బాషా, హుసేన్ బీ పాల్గొన్నారు.

తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వై.గిరిజమ్మ

మంత్రాలయం : వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ వై.గిరిజమ్మ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శోభారాణి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు వారివారి శాఖల ప్రగతి నివేధికలను వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలన్నారు. ఆయా గ్రామాలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వారివారి గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులలో పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ లాలీ కృష్ణయ్య, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఎంఈఓ మోహినుద్దీన్, ఈఓపీఆర్డీ ప్రభావతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్యం ప్యాకెట్లు స్వాధీనం

ఆదోని అర్బన్: పట్టణంలోని రైతు బజారు వద్ద కర్ణాటక మద్యం ప్యాకెట్లను తరలిస్తుండగా టూటౌన్ పోలీసులు మంగళవారం దాడులు చేశారు. రైతు బజారు వద్ద మద్యం ప్యాకెట్లను తరలిస్తున్న హనుమంతమ్మ, సుజాత అనే మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 165 ప్యాకెట్ల కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

దళితులను అడ్డుకుంటే జైలుకు పంపుతాం

ఆదోని రూరల్: దేవరలో దళితులను ఎవరైనా అడ్డుకుంటే కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని తహసీల్దార్ శివరాముడు హెచ్చరించారు. మండలంలోని జి.హొసల్లి గ్రామంలో మంగళవారం తహసీల్దార్, పోలీసులు పర్యటించారు. కేవీపీఎస్ గ్రామ అధ్యక్ష కార్యదర్శి రమేష్, సురేష్‌లు గ్రామంలో ఊరి దేవరలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇటీవల జిల్లా కలెక్టర్, ఆదోని సబ్‌కలెక్టర్, డీఎస్పీలకు వినతి పత్రాలను అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం అధికారులు గ్రామంలో పర్యటించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో ఊరి దేవర కార్యక్రమంలో అగ్రకులాల వారు దళితులను కులవివక్షతకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు అధికారుల రక్షణలో అందరిలాగానే దళితులు కూడా కుంభాలతో ఆలయాలకు చేరుకుని పూజలు చేయవచ్చన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ లోపాలను సరి చేయాలి

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలలో భవిషత్ అవసరాల కోసం ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణలో ఉన్న లోపాలను సరి చేయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య అధ్యక్షుడు అనిల్ కుమార్ నాయకులు భాస్కరాచారి, బడుగు బసవరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం మండల విద్యాధికారి-2 శ్రీనివాసులకు పేరెంట్స్, టీచర్ కమిటీ సభ్యులు లేఖను సమర్పించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో నెహ్రూస్మారక పురపాలక ఉన్నత పాఠశాల, మండిగిరి ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోకి మ్యాపింగ్ చేయరాదని వారు కోరారు. కార్యక్రమంలో ఏపీఎంటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, జిల్లా నాయకులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధం ఊరేగింపు



గంధాన్ని ఊరేగిస్తున్న ఖాదర్‌లింగస్వామి వంశస్తులు, వివిధ దర్గాల పీఠాధిపతులు

- నేడు కలుగోడులో ఉరుసు
- కర్ణాటకకు గంధంతో తరలివెళ్లిన ఖాదర్‌లింగస్వామి భక్తులు



ప్రత్యేక వాహనంపై గంధం తీసుకెళ్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళం నుంచి మంగళవారం గంధాన్ని కర్ణాటక రాష్ట్రం కురుగోడుకు తీసుకుని వెళ్లారు. కౌతాళంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగస్వామి దర్గాకు 10వ ధర్మకర్తగా 41సంవత్సరాలు సేవలు అందించి 2022 జనవరి 26న మృతి చెందిన సయ్యద్ సాహెబ్‌పీర్ హుసేని చిష్తీ మూడవ ఉరుసు బుధవారం కర్ణాటక రాష్ట్రం కురుగోడులో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం ఖాదర్‌లింగస్వామి దర్గాలో ప్రత్యేక ఫాతెహాల అనంతరం గంధాన్ని, ప్రత్యేక చాదర్‌ను గ్రామ పూర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి, ప్రత్యేక వాహనంలో కర్ణాటకకు తరలించారు. కార్యక్రమం బీదర్ దర్గా పీఠాదిపతి నజీమ్‌హుసేన్, సర్మస్‌వలి దర్గా వంశస్తుడు సయ్యద్ దూద్‌బాషా, లో వివిధ దర్గాల పీఠాధిపతులు పాల్గొన్నారు. ఉరుసు వేడుకలను వైభవంగా నిర్వహించడానికి కౌతాళంతో పాటు కురుగోడులో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఖాదర్‌లింగస్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా తెలిపారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

ఎమ్మిగనూరురూరల్: రైతులు పంటల సాగులో సమగ్ర సస్య రక్షణ పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి అన్నారు.మంగళవారం మండల పరిధిలోని వెంకటాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు.